క్లుప్తంగా

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



కోడూరు: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కోడూరు గంగాభవాన అమ్మవారికి ఆదివారం భక్తులు ఆషాఢ సారెను సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. యర్రారెడ్డివారిపాలెం గ్రామస్తులు స్థానిక రామాలయం వద్ద నుంచి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. డప్పువాయిద్యాలు, మేళతాళాల నడుమ సారెను భక్తులు ఆలయం చుట్టూ ఊరేగించారు. చీరలు, గాజులు, పసుపు, కుంకుమ, వివిధ పండ్లుతో పాటు నైవేద్యాలను భక్తులు అమ్మవారికి సమర్పించి భక్తిప్రపత్తులు చాటారు. ఆలయ ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఆషాఢ సారె విశిష్టతను వివరించారు. ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ అర్చకుడికి సన్మానం



మోపిదేవి: స్థానిక మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నాలుగు దశాబ్దాల పాటు ఆలయ అర్చకుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన కాశీభట్ల బాల కృష్ణశర్మను ఆదివారం ఘనంగా సన్మానించారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అసిస్టెంట్ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో మోపిదేవి టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో బాలకృష్ణశర్మ దంపతులకు పూలదండలు వేసి నూతన వస్త్రాలు, స్వామి చిత్రపటం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను పలువురు అర్చకులు, వేదపండితులు కొనియాడారు. ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్ కుమార్‌శర్మ, ఆలయ ఘనాపాటి నౌడూరు సుబ్రహ్మణ్యశర్మ, ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటితో గుప్త నవరాత్రులకు స్వస్తి



నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయం ఆధ్వర్యంలో ప్రప్రథమంగా నిర్వహించిన శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవాలు జయప్రదంగా కొనసాగిన నేపథ్యంలో సోమవారం ఈ ఉత్సవాలకు స్వస్తి పలుకనున్నట్లు శ్రీరామ క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తొమ్మిదో రోజు వారాహి అమ్మవారు లలితాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకుడు ముదునూరి అచ్యుత శేఖరశర్మ తెల్లవారు జామున 5గంటలకు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, కళావతి దంపతులు వారాహిదేవికి శాస్త్రోక్తంగా కుంకుమ పూజ జరిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం పూజా క్రతువులో పలు జంటలు పీటలపై కూర్చున్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని లలితా దేవిగా కొలువైన వారాహి మాతకు మంత్ర పుష్ప నీరాజనాలు సమర్పించి, భక్తులుకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఉప్పల లీలా కృష్ణ ప్రసాద్ (బుజ్జి), బోయపాటి రాము, మహిళా సేవకులు, కమిటీ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ నాగరాజుకు ఎంపీ నివాళి



పెడన: తూర్పు లద్దాఖ్ సమీపంలో నదిలో సైనిక విన్యాస సమయంలో మృతి చెందిన ఆర్మీ జవాను సాదరబోయిన నాగరాజును ఈ భరతభూమి ఎప్పటికీ మరచిపోదని మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆదివారం సాయంత్రం ఎంపీ బాలశౌరి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి చేవేంద్ర గ్రామంలోని నాగరాజు నివాసాన్ని సందర్శించారు. నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అన్నివేళలా సహాయకారిగా ఉంటామని ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు నాగరాజు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. వీరితో పాటు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వారి వెంట ఉన్నారు.

జాతీయ రహదారి నిర్వహణలో నిర్లక్ష్యం



రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద మార్జిన్‌లో పెద్ద పెద్ద బండరాళ్లు



చెట్ల మాటున తుమ్మలపాలెం ప్రాంతంలో ఏర్పాటు చేసిన సూచిక

ఈనెల 3న సుల్తానగరం సమీపంలో ద్విచక్రవాహనంపై డివైడర్ దాటుతున్న కుంభా వెంకటేశ్వరరావును కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు..గత ఆదివారం రామరాజుపాలెం కాల్వ దగ్గర కారు అదుపుతప్పడంతో విజయవాడ నుంచి మచిలీపట్నం బీచ్‌కు వెళ్తున్న నలుగురు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు..మచిలీపట్నం–గూడూరు మధ్య ఈ నెలలో ఇప్పటివరకు జరిగిన రెండు ఘటనలు. మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు నిత్యం ప్రమాదాలతో ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. ఈ రహదారి నాలుగు వరసలుగా నిర్మించిన తర్వాత వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. అయితే రహదారి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటం పట్ల ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రధానంగా తరకటూరు సమీపంలో రోడ్డుకిరువైపులా తుమ్మ చెట్లు దట్టంగా పెరిగి రోడ్డుపైకి వచ్చేశాయి. గ్రామాల సూచికలు చెట్ల చాటుకు వెళ్లిపోవడంతో చోదకులు గమ్యస్థానాలు దాటి వెళ్లిపోయి వెనక్కు తిరిగిరావాల్సి వస్తోంది. చిట్టిగూడూరు, తరకటూరుపాలెం, పర్ణశాల వంటి చిన్న చిన్న గ్రామాలు ఉన్న ప్రాంతాల్లో యూటర్న్‌లు ఏర్పాటు చేయకపోవడంతో డివైడర్‌ను పగులగొట్టి రోడ్డు దాటుతున్నారు. ఇలాంటి సమయంలో వేగంగా వెళ్లే వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

–గూడూరు



చిట్టిగూడూరు దగ్గర డివైడర్‌ను పగలగొట్టిన ప్రాంతం



గత ఆదివారం మితిమీరిన వేగంతో వెళ్తూ అదుపుతప్పి కాల్వలోకి వెళ్లిన కారు (ఫైల్)



ఈనెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెంకటేశ్వరరావు (ఫైల్)

ముమ్మరంగా వ్యవసాయ పనులు



సాతులూరు గ్రామంలో వెద చల్లిన పొలంలో కలుపు మందు పిచికారీ చేస్తున్న రైతు

బంటుమిల్లి: బంటుమిల్లి కాలువకు నీరు రావడంతోపాటు అల్పపీడన ప్రభావానికి వర్షాలు తోడవడంతో గత కొద్ది రోజులుగా వ్యవసాయ పనులను రైతులు ముమ్మరం చేశారు. వ్యవసాయ శాఖాధికారుల సమాచారం మేరకు మండలంలో దాదాపు 7 వేల ఎకరాల్లో వెద పద్ధతిన రైతులు సార్వా సాగు చేస్తున్నారు. మిగిలిన సుమారు 4 వేల ఎకరాల్లో నాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రైతులు వేలాది ఎకరాల్లో విత్తనాలు వెద చల్లారు. అయితే వర్షాలు ముఖం చాటేయడం, కాలువలకు నీరు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గత సంవత్సరం ఇలాంటి పరిస్థితులు ఏర్పడటంతో రైతులు రెండుసార్లు విత్తనాలు చల్లుకున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సంవత్సరం సార్వా సాగును కొద్ది రోజులు ఆలస్యంగానే ప్రారంభించారు. ఈ క్రమంలో విత్తనాలు వెదచల్లి దాదాపు 15 రోజులకు పైగా కావడంతో కలుపు మందులు చల్లే పనుల్లో నిమగ్నమయ్యారు. కలుపు మందు పిచికారీ చేసిన వెంటనే రెండు రోజుల్లో పొలానికి నీరు పెట్టాల్సి ఉంది. దీంతో బంటుమిల్లి ప్రధాన కాలువకు నీరు రావడంతోపాటు గత రెండు రోజులుగా చెదురుమదురు వానలు తోడవడంతో కలుపు మందుల పిచికారీ పనులు పెద్ద ఎత్తున చేస్తున్నారు. కాలువకు నీరు రావడంతో నారుమళ్లు పోసుకునేందుకు ముంజులూరు, కంచడం, బర్రిపాడు తదితర గ్రామాల రైతులు నారుమళ్లు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

దివిసీమకు సాగునీరు విడుదల



సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోపిదేవివార్పు(మోపిదేవి): పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు దివిసీమ రైతాంగానికి అందించినట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని మోపిదేవివార్పు వద్ద అక్విడెక్టు నుంచి గోదావరి జలాలను దివిసీమకు ఆదివారం లాకులు పైకి ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా డెల్టాలో చిట్టచివరి ప్రాంతమైన అవనిగడ్డ నియోజకవర్గానికి పట్టిసీమ నీటితో ముందుగా తాగునీటికి చెరువులు నింపుకోవాలని, అనంతరం వ్యవసాయానికి వినియోగించుకోవాలని సూచించారు. ఇరిగేషన్ డీఈ రవికిరణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో సుమారు 70 వేల ఎకరాల ఆయకట్టు, 44 మంచినీటి చెరువులకు నీటిని నింపవలసివుందని అన్నారు. నియోజకవర్గంలో 2 వేల ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు చేశారని చెప్పారు. 6 మండలాల్లోని 14 డ్రెయినేజీ పనులు, తూటుకాడ, గుర్రపుడెక్క, తొలగింపు పనులకు రూ.2.74 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో డ్రెయినేజీ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. నడకుదుటి జనార్ధనరావు, మత్తి శ్రీనివాసరావు, రావి రత్నగిరి, దిడ్ల జానకీ రాంబాబు, కొల్లూరి వెంకటేశ్వరావు, మత్తి వెంకటేశ్వరావు, కోసూరి రామాంజనేయులు, బంటి, మోర్ల రాంబాబు, ఇరిగేషన్ ఏఈలు వెంకటేశ్వరావు, జనార్ధన్, పలువురు రైతులు పాల్గొన్నారు. తొలుత సర్ ఆర్థర్ కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాదర్బారులో వినతులు స్వీకరించిన మంత్రి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: ప్రజా దర్బారులో టిడ్కో ఇళ్లకు సంబంధించి అర్జీలు వస్తున్నాయని, ఈ విషయమై రాష్ట్రస్థాయిలో త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారి శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నగరంలోని జవ్వారుపేట టీడీపీ కార్యాలయ ఆవరణలో ఆదివారం రాష్ట్ర మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతోందన్నారు. త్వరలోనే మచిలీపట్నానికి మహర్దశ రాబోతుందని ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.58 కోట్లతో అమృత్ పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీ రూ.60 నుంచి రూ.70 వేల కోట్లతో నెలకొల్పడం జరుగుతుందని ఇందుకోసం బీపీసీఎల్ ప్రతినిధులు ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి సుముఖత వ్యక్తం చేశారన్నారు. మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి కేంద్రం నుంచి పథకాలు, నిధులు తీసుకురావడానికి అనేక విధాలుగా కృషి చేస్తున్నారన్నారు. కేవలం రవాణా, లోడింగ్ చార్జీలు కట్టుకుంటే ఉచితంగా ఇసుకను పేదలందరూ పొందే అవకాశం కల్పించామన్నారు. నగరంలోని మురుగు కాలువల్లో పూడికలను తొలగించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులకు ఇప్పటికే సూచించామని ఆ పనులు జరుగుతున్నాయన్నారు. జీజీహెచ్‌లో శిశువు అపహరణ సంఘటనపై మంత్రిని ప్రశ్నించగా ఈ ఘటనకు ఆస్పత్రి సిబ్బంది ఎవరైనా సహకరించారా అనే కోణంలో విచారణ జరుగుతుందని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. భద్రత వైఫల్యం వలనే ఇది జరిగిందని, ఇటువంటివి పునరావృతం కాకుండా పటిష్ట భద్రతను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

లంకపల్లి(ఘంటసాల): మండలంలోని లంకపల్లి, పాపవినాశనం గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పలు కుటుంబాలను పరామర్శించారు. లంకపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, నీటి సంఘం అధ్యక్షుడు గువ్వాబత్తిన నాగేశ్వరరావు మాతృమూర్తి అనసూర్య ఇటీవల మృతి చెందగా ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిశే వీరుళ్లు కుమారుడు శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే గ్రామానికి చెందిన వీరమాచినేని అంకినీడు ప్రసాద్ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు నాని, చిన్నిలను పరామర్శించారు. పాపవినాశనం గ్రామానికి చెందిన దోనేపూడి శివరత్నాకర్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయా కుటుంబాల వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), టీడీపీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దిరిశం వెంక్రటావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పరిశే చలపతి, కేఎస్ చక్రవర్తి, కుంపటి చిట్టిబాబు, మునిపల్లి బుజ్జి, డి.ప్రభాకర్, ఎస్.వెంకటేశ్వరరావు, వీరయ్య చౌదరి, కె.లీలాకృష్ణ, ఎం.చంద్ర, పి.సుదర్శనరావు, ఎం.కోటి, పి.ఎర్రబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడిగా మారుతున్న రోడ్డు



కొడాలి ఎస్సీ కాలనీలో చిత్తడిగా మారిన రోడ్డును చూపుతున్న స్థానికులు

కొడాలి(ఘంటసాల): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని కొడాలి ఎస్సీ కాలనీలో చినుకుపడితే రోడ్డు చిత్తడిగా మారుతోంది. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఘంటసాల గోటకం కాలనీలోని పలు రోడ్లు ముంపునకు గురికాగా పంచాయతీ కార్మికులు డ్రెయినేజీ పూడిక తీయడంతో ప్రజల ఇబ్బందులు తొలగాయి. స్థానిక ప్రధాన సెంటర్లో మల్లంపల్లి వెళ్లే రోడ్డులో వర్షపు నీరు తగ్గుముఖం పట్టడంతో పంచాయతీ కార్మికులు బ్లీచింగ్ చల్లారు. ప్రజలు డ్రెయినేజీకి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాలు డ్రెయినేజీలో వేయొద్దని అధికారులు కోరారు.

కరకట్ట రోడ్డుకు మరమ్మతులు చేయండి



కోసూరువారిపాలెం(మోపిదేవి): మోపిదేవి వార్పు నుంచి అయోధ్య కృష్ణా కరకట్టపై వాహనాల రాకపోకలకు రహదారి మరమ్మతులు చేపట్టాలని కోసూరువారిపాలెం మాజీ ఉపసర్పంచ్, జనసేన పార్టీ నాయకులు కోసూరు రామాంజనేయులు స్థానిక ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మోపిదేవి వార్పు వద్ద ఆదివారం ఎమ్మెల్యేను కలిసిన కరకట్టపై పెద్ద పెద్ద గుంతలు పడటంతో రైతులు పంటలను సకాలంలో మార్కెట్‌కు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులను, ఆయా గ్రామస్తులను దృష్టిలో పెట్టుకుని రహదారి మరమ్మలు చేపట్టాలని ఎమ్మెల్యేని కోరారు.

జీవనశైలి, ఆహారపు అలవాట్లతో హృద్రోగ సమస్యలు



రోగులను పరీక్షిస్తున్న గుండె వైద్య నిపుణులు కృష్ణచంద్

పమిడిముక్కల: ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్లు ఇతర కారణాలతో పలువురికి వయస్సుతో సంబంధం లేకుండా హృద్రోగ సమస్యలు ఎదురవుతున్నాయని ప్రముఖ గుండె వైద్య నిపుణులు కాగిత కృష్ణచంద్ అన్నారు. విజయవాడ సెంటినీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో తాడంకి గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ జంపాన ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణచంద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లతో పాటు వైద్య నిపుణుల సూచనలు తీసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నిపుణుల వైద్యసేవలు అందాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి విజయవాడలోని సెంటినీ హాస్పిటల్‌కు తీసుకువెళ్లి అవసరమైన వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ పథకం పరిధిలో ఉన్న ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు సెంటినీ హాస్పిటల్ పేషెంట్ కేర్ ఏజీఎం పెదబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, కూచిపూడి వీరాస్వామి పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేయాలి

గుడివాడ టౌన్: పట్టణంలో అన్ని పెట్రోల్ బంక్‌లను కంపెనీ వారితో పాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తరచుగా తనిఖీలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో పెట్రోలు బంక్‌ల తనిఖీలు సక్రమంగా జరగకపోవడంతో కల్తీ పెట్రోలు అమ్మకాలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇటీవల ఓ బంక్‌లో పెట్రోల్‌లో నీరు కలిసిందని వినియోగదారులు ఆందోళన చేపట్టారన్నారు. బంక్ యజమానులు సాంకేతిక సమస్య వలన అలా జరిగి ఉంటుందని, కల్తీకి ఆస్కారం లేదని వారు చెబుతున్నారన్నారు. అధికారికంగా తనిఖీలు నిర్వహిస్తే ప్రజల్లో నమ్మకం కలుగుతుందన్నారు. తక్షణమే పట్టణంలోని అన్ని పెట్రోల్ బంక్‌లు తనిఖీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఆర్.కొండ, సమీర్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతుల మీదుగా చెక్ అందిస్తున్న రామ్మోహనరావు

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు దాసరి రామ్మోహనరావు రూ.5 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతుల మీదుగా 'మనకోసం మనం ట్రస్ట్' నిర్వాహకులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 11 సంవత్సరాల క్రితం ప్రారంభించిన 'స్వచ్ఛసుందర చల్లపల్లి' కార్యక్రమం సాంఘిక విప్లవమని అన్నారు. స్థానిక పద్మావతి వైద్యశాల వద్ద ఆదివారం జరిగిన 3,176వ రోజు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. స్వచ్ఛసుందర చల్లపల్లి కార్యకర్తలతో కలసి ఆయన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో కొంత విరామం ఇచ్చిన స్వచ్ఛ సుందర చల్లపల్లి మరో 108 రోజులు అయితే ఈ కార్యక్రమం 9 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని చెప్పారు. మనకోసం మనం ట్రస్ట్ ద్వారా డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలతో కలసి డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, ఆర్టీసీ బస్టాండ్, సంపద కేంద్రం, పద్మావతి హాస్పటల్ రోడ్డులో మొక్కల పెంపకం, పరిశుభ్రత కార్యక్రమం ద్వారా సుందరంగా తీర్చిదిద్దారని చెప్పారు. భవిష్యత్‌లో ఈ కార్యక్రమం మరింత గుర్తింపు సంతరించుకోనుందని బుద్ధప్రసాద్ వెల్లడించారు. ఈ కార్యక్రమం మరింత విజయం సాధించేందుకు తన వంతు సహకారం అందించనున్నట్టు తెలిపారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, డాక్టర్ దాసరి వరుణ్ దంపతులు, దాసరి చిన్నాజీ దంపతులు, పంచాయితీ ఈవో మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.సుధాకర్‌తో పాటు స్వచ్ఛసుందర చల్లపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా రక్షిత మంచినీటి చెరువు నిండేనా..?



మెగా రక్షిత మంచినీటి చెరువు నింపేందుకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ మోటార్లు

కృత్తివెన్ను: మండు వేసవిలో తీరగ్రామ ప్రజల దాహార్తి తీర్చే మెగా రక్షిత మంచినీటి పథకం చెరువు అడుగంటిపోవడంతో దాదాపు నెల రోజులుగా నీటి సరఫరా నిలిచింది. దీంతో ప్రజలు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. రెండు రోజుల కిందట పంట కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో మెగా మంచినీటి చెరువును నింపేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు పది నుంచి 12 హైస్పీడ్ విద్యుత్ మోటర్లను ఏర్పాటు చేసి నీటిని తోడి చెరువును నింపేందుకు వినియోగిస్తున్నారు. ఇది ఇలా ఉంటే చెరువులో నీరు నింపాలంటే విద్యుత్ మోటార్లకు పూర్తిస్థాయిలో నీరందాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం కాలువ ద్వారా వస్తున్న నీరు ఖరీఫ్ నారుమళ్లకు, వెదజల్లిన పంట పొలాలకు తాగునీటి చెరువులకు సమానంగా అందుతాయానే ప్రశ్న స్థానిక ప్రజల్లోను నెలకొంది. పంట కాలువ ద్వారా పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేసి తాగునీటి చెరువులు, వ్యవసాయ భూములకు ఎటువంటి ఆటంకం లేకుండా నీరందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

20న 'మానవత' నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

పెడన: వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డిచే పెడన శాఖ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 20న జరుగుతుందని సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక బంగ్లా స్కూలులో ప్రమాణస్వీకారానికి సంబంధించి సన్నహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 3 గంటలకు పెడనలోని బంగ్లా స్కూలులో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ జిల్లా డైరెక్టర్ ముదిగొండ శాస్త్రి, మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు పి. శ్రీరామ్, పెడన శాఖ అధ్యక్షుడు మట్టా రాధాకృష్ణమూర్తి, సుబ్బారావు, సాంబశివరావు, ఖుర్షీద్ బేగం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అవగాహనపై సదస్సు



రక్షణసైన్యం దిండి కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న యువత

నాగాయలంక: రక్షణసైన్యం(సాల్వేషన్ ఆర్మీ) నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో సంస్థ స్థానిక కార్యాలయం ఆవరణలో వార్షిక కార్యక్రమంగా జూనియర్ హోమ్ లీగ్ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రక్షణ సైన్యం జిల్లా అధికారి(డీఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు, మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీనరత్నకుమారి నేతృత్వంలో యువతీ యువకులకు (యవ్వనస్తులకు) సామాజిక అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మద్రాసు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న తెలుగు గడ్డపై 1895లో విజయవాడలో తొలుత స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ అజీజ్ ఈ సంస్థను ప్రారంభించారని, ప్రస్తుతం 700 గ్రామాల్లో హీనస్థితిలో ఉన్న వేలాది మంది అభాగ్యుల సేవలకు సంస్థ అంకితమై పనిచేస్తోందని వివరించారు. ఈ సందర్భంగా యవ్వనస్థులతో సామాజిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కెప్టెన్ సీహెచ్.వకీలాదేవి, కెప్టెన్ జి.కేజియాకుమారి, లెఫ్టినెంట్ వి.వీరకుమారి తదితర నాయకులు, బాలలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. నాగాయలంక, దిండి, దింటిమెరక, నల్లూరులలోని సంస్థ చర్చిలలో ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు దీనరత్నకుమారి తెలిపారు.